ఏడాదైనా కాలే.. వదిలేశారు!

నిర్వహణ లేక అధ్వానంగా ప్రజా మరుగుదొడ్లు
- శుభ్రం చేయక దుర్వాసన వెదజల్లుతున్న వైనం
- నీటి సౌకర్యం లేక అవస్థలు



నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

కారేపల్లి: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రజా మరుగుదొడ్లను రోజువారీ శుభ్రం చేయలేక లక్షణంగా వదిలేశారు. దీంతో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లు అధ్వానంగా తయారై దుర్వాసన వెదజల్లుతున్నాయి. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ అనుబంధ మాధారం డోలమైట్ మైన్స్ యాజమాన్యం స్వచ్ఛతా మిషన్‌లో భాగంగా సీఎస్ఆర్ నిధులు రూ.6.75 లక్షలతో ప్రజా మరుగుదొడ్లను నిర్మించింది. ఈ మేరకు 2024 అక్టోబర్ 13న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్నా మరుగుదొడ్లు నిర్మించి ఏడాది తిరగకముందే నిరుపయోగంగా మారటంతో అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలకేంద్రం నుంచి ఖమ్మం, ఇల్లెందు, డోర్నకల్ పట్టణాలకు వెళ్లాలంటే కారేపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్సులు, ఆటోల ద్వారా తమ ప్రయాణాలను కొనసాగిస్తుంటారు. దీంతో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు ఇక్కడే నిరీక్షిస్తూ ఉంటారు. దీంతో పాటు, బస్టాండ్ సెంటర్‌లో ఉన్న దుకాణాదారులు, చిరువ్యాపారులు, మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చిన ప్రజల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లకు వాటరింగ్ చేయకపోవటంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి.. పాడైపోయిన బోరు మోటరుకు మరమ్మతులు చేయాలని, అదే విధంగా ప్రజా మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణ లోపంతో నిరుపయోగంగా..


మరమ్మతులకు గురైన బోరు


విరిగిపోయిన తలుపు

మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుతూ ప్రజలకు సౌకర్యార్థంగా ఉంచాల్సిన పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఏడాదిలోపే మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాల్సిన పరిస్థితి వచ్చింది. మరుగుదొడ్ల తలుపులు ఊడిపోవటం, పైపులైన్లు పగిలిపోయాయి. ఇటీవల మరుగుదొడ్లకు నీటి సరఫరా అయ్యే బోరు మోటరు సైతం పాడైపోవటం అధికారులు సైతం మరమ్మతులు చేయకపోవటంతో మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికులు నిలబడలేని పరిస్థితుల్లో దుర్వాసన వెదజల్లుతుండడతో అవస్థ పడుతున్నారు.

దుర్వాసన తట్టుకోలేకపోతున్నాం..



ప్రజా మరుగుదొడ్లను బాగు చేయాలి. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవటంతో మరుగుదొడ్లు శుభ్రపరచకపోవటంతో అధ్వానంగా తయారయ్యాయి. బస్టాండ్ సెంటర్‌లో దుర్వాసన భరించలేక పోతున్నాం. ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం నిరీక్షించాలంటే దుర్వాసనకు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా మరుగుదొడ్లను వాడుకలోకి తీసుకొస్తే బాగుంటుంది.

– బాణాల రాము, కారేపల్లి

ఎవరూ పట్టించుకోట్లేదు..



మరుగుదొడ్లకు వాటరింగ్ లేకపోవటంతో దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవటంతో లక్షలు పెట్టి నిర్మించిన మరుగుదొడ్లు ఏడాది తిరగకముందే నిరుపయోగంగా మారాయి. బోరు మోటరు పాడైపోయిన ఎవరూ పట్టించుకోట్లేదు. బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి.

– బొందల పెంటయ్య, కారేపల్లి

రైతులకు అందుబాటులో యూరియా


చింతకాని : యూరియాను పరిశీలిస్తున్న విజయ్‌చంద్ర


ఏన్కూరు : రైతులకు సూచనలు ఇస్తున్న కరుణశ్రీ

చింతకాని: రైతులందరికీ అవసరమైన యూరియా అందుబాటులో ఉందని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర తెలిపారు. చింతకాని సొసైటీ ఆధ్వర్యాన జగన్నాధపురం, కొదుమూరుల్లో యూరియా పంపిణీ కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశాక మాట్లాడారు. మండలానికి రావాల్సిన ఎరువుల కోటా వస్తున్నందున కృత్రిమ కొరత సృష్టించకుండా రైతులకు సరఫరా అయ్యేలా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అయితే, రైతులు అవసరానికి మించి యూరియా తీసుకోవద్దని, నానో యూరియా వాడకంపై దృష్టి సారించాలని సూచించారు. కాగా, యూరియా సరిపడా ఇవ్వలేదని జగన్నాధపురం రైతువేదిక వద్ద రైతులు ఆందోళన చేపట్టగా వ్యవసాయాధికారులు, పోలీసులు సర్దిచెప్పారు. ఏఓ మానస, సొసైటీ సీఈఓ మారగాని శ్రీనివాసరావు, ఏఈఓలు రాము, తేజ, ఆయేషా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకే యూరియా వాడాలి

ఏన్కూరు: రైతులు పంటల్లో అవసరం మేరకు విడతల వారీగా యూరియా వాడాలని వైరా ఏడీఏ కరుణశ్రీ సూచించారు. ఏన్కూరు పీఏసీఎస్‌ను సోమవారం తనిఖీ చేసిన ఆమె యూరియా పంపిణీ, నిలవ్వపై ఆరా తీశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ యూరియాకు సమానమైన నానో యూరియా వాడకంపై దృష్టి సారిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఏఓ నర్సింహారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్

వైరా: నియోజకవర్గంలో అర్హులైన ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. వైరాలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేసి మాట్లాడారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వంలో ఎవరికీ అన్యాయం జరగదని చెప్పారు. కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, దాసరి దానియేలు, దొబ్బల సౌజన్య, బోళ్ల గంగారావు, మట్టూరి వెంకటేశ్వరరావు, మచ్చా బుజ్జి, దార్న రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న శరత్

సత్తుపల్లిరూరల్: సింగరేణి లాభాల వాటాలో కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటాలో గతేడాది కంటే అదనంగా రూ.500 మాత్రమే పెంచడం ద్వారా ప్రభుత్వం అన్యాయం చేసిందని టీఎస్‌సీడబ్ల్యూటీయూసీఐ రీజియన్ అధ్యక్షుడు అమర్లపూడి శరత్ పేర్కొన్నారు. సత్తుపల్లిలోని సమంతా క్యాంప్ వద్ద సోమవారం ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా వివిధ విభాగాల్లో 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నా లాభాల వాటా పంపిణీలో అన్యాయం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంజీవరెడ్డి, ప్రసాద్, రమేష్, జాన్, రవి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

93 మంది మున్సిపల్ కార్మికులకు బీమా


వివరాలు నమోదు చేస్తున్న ఉద్యోగులు

కల్లూరు: కల్లూరు మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న 93 మంది కార్మికులకు సోమవారం బీమా ప్రమాద బీమా చేయించారు. వీరికి రూ.10 లక్షల విలువైన పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించినట్లు మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు ఊడల కృష్ణమూర్తితో పాటు ఎస్‌కే.వజీర్ మియా, ప్రకాశ్, సుధాకర్, యశోద, సీతమ్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు


బ్యాగ్‌లు అందజేసిన ఎస్ఐ రామారావు

వైరా: చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన వైరాలోని పలు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సోమవారం స్కూల్ బ్యాగ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పుష్పాల రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నందున విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

చింతకాని: మండలంలోని నేరడకు చెందిన వంకాయలపాటి మమత ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన సాయం చెక్కును సోమవారం సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు అందజేశారు. మమత వైద్య ఖర్చులకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సిఫారసుతో రూ.31,500 సాయం మంజూరైందని తెలిపారు. కాంగ్రెస్, సీపీఐ నాయకులు మంకెన నాగేశ్వరరావు, చెవుల తిరుపతిరావు, మట్టా రవి, గ్రామస్తులు వంకాయలపాటి గోవిందరావు, నర్సయ్య, ఆలస్యం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ముదిగొండ: ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం కంటి వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. కంటి వైద్య నిపుణులు పుల్లయ్య ఆధ్వర్యాన 62మంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు. అలాగే, కంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు ఏ.అరుణాదేవి, నస్రీన్ జహాన్, ఉద్యోగులు మధుసూదన్‌రావు, పద్మావతి, లత పాల్గొన్నారు.

గోపాలమిత్రల మండల కమిటీ ఎన్నిక

కల్లూరు: గోపాలమిత్రల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన సోమవారం ఈ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా ఆదూరి శివకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అవులూరి నాగిరెడ్డి, కోశాధికారిగా భాష్యం కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పరిగడపు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులుగా బొడ్డు వెంకటేశ్వర్లు, బర్రి విజయ్‌కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా ఖమ్మంపాటి అప్పారావు, దరావత్ రవికుమార్, రావూరి రమేష్, పైళ్ల హన్మంతరావు, కందిమల్ల విజయ, నల్లగట్ల కోటేశ్వరరావు, భూక్యా మాధవి ఎన్నికయ్యారు.

పొరుగువారిని ప్రేమించాలి


దివ్యబలి పూజ చేస్తున్న ఫాదర్లు

కొణిజర్ల: ప్రజలందరూ దైవచింతన కలిగి ఉండడమేకాక పొరుగువారిని ప్రేమించాలని పెద్దగోపతి విచారణ గురువు మాదాసు రాజు, ఫాదర్ కిన్నెర రమేష్ సూచించారు. పెద్దమునగాలలో సిస్టర్ బైరం అశ్విని ఆధ్వర్యాన సోమవారం ప్రత్యేక దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడగా గురువులు తప్పట శౌరి, ప్రేమ్‌కుమార్, మదన్‌రాజా, ఫాదర్ లాజర్, తలారి అబ్రహం, లింగాల మధు, సైదులు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి


యూనిఫామ్ అందిస్తున్న దయానంద్

పెనుబల్లి: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరడం ద్వారా తల్లిదండ్రులు, అధ్యాపకులకు పేరు తీసుకురావాలని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ సూచించారు. ఆశా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, యూనిఫామ్ అందజేశాక ఆయన మాట్లాడారు. సత్తుపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థినులకు 250 సైకిళ్లు, 1,500 మంది కళాశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫామ్ అందించామని తెలిపారు. సత్తుపల్లి సీఐ ముత్తులింగం, కల్లూరు మార్కెట్ చైర్మన్, వైస్‌చైర్మన్లు భాగం నీరజ ప్రభాకర్, కోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, నాయకులు పసుమర్తి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

జర్నలిస్టును దూషించిన వారిపై కేసు

మధిర: ఓ దినపత్రిక జర్నలిస్టును దూషించిన ఇద్దరిపై మధిర టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. బోనకల్ మండలం కలకోటకు చెందిన జర్నలిస్టు కటికల శ్యాంబాబును ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న మాటూరుకు చెందిన మోదుగు కిరణ్, కె.పవన్ దుర్భాషలాడారు. ఈ విషయమై శ్యాంబాబు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఘటనను మధిర ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాగి బాలస్వామి, చేకూరి వినోద్, గౌరవ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, కోశాధికారి పి.ప్రసాదరావు ఖండించారు.

ట్రాఫిక్ అంతరాయంపై...

చింతకాని: చింతకాని మండలం జగన్నాథపురం రైతువేదిక వద్ద బ్యాండ్ వాయిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన ఆరుగురిపై సోమవారం కేసు నమోదైంది. బొప్పారానికి చెందిన బ్యాండ్ బృందం దుర్గాదేవి విగ్రహం వద్దకు సోమవారం వచ్చింది. అదే సమయాన జగన్నాథపురం రైతువేదిక వద్ద యూరియా కోసం రైతులు ఆందోళన చేస్తుండగా.. ఓ వ్యక్తి బ్యాండ్ బృందాన్ని పిలిపించి మేళం వాయిస్తూ వాహనాలను అడ్డుకున్నారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోగా పోలీసులు సర్దిచెబుతున్నా వినలేదు. ఈ మేరకు కానిస్టేబుల్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై వీరేందర్ తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ముదిగొండ: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఖమ్మం రూరల్ సీడీపీఓ కమలప్రియ తెలిపారు. మండలంలోని మాధాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ మాసోత్సవాల సమావేశంలో ఆమె మాట్లాడాక బతకమ్మ ఆడారు. ఏసీడీపీఓ శారదాశాంతి, సూపర్‌వైజర్ ఉమారాణి, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కొణిజర్ల/చింతకాని: కొణిజర్ల మండలం లాలాపురానికి చెందిన గ్రామీణ వైద్యుడు గండమాల దేవరాజు – జయలక్ష్మి కుమారుడు అభినయకుమార్ ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంపై పలువురు అభినందించారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన అభినయకుమార్, దేవరాజును సత్కరించారు. నాయకులు రాంబాబు, బ్రహ్మం, సురేష్, మణికుమార్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, సుధాకర్, నాగేంద్ర పాల్గొన్నారు. చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన గార్లపాటి మనీషా మెడికల్ సీటు సాధించగా శ్రీ ఆదర్శ విద్యాలయం బాధ్యులు సన్మానించారు. కరస్పాండెంట్ బోడెపూడి కిరణ్, ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు రేణుక, సురేష్, కిరణ్, సుజాత ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



బోనకల్: మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేయగా సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, తూము రోషన్, రామకృష్ణ, గిరి, వసంతరావు, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు ఆహ్వానం

కల్లూరు: కల్లూరులో ఆర్యవైశ్యుల ఆధ్వర్యాన జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆహ్వానించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావుతో పాటు చారుగుండ్ల అచ్యుతరావు, శ్రీనివాసరావు, చలువాది నగేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నాయకుల అరెస్టు గర్హనీయం

తల్లాడ: కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి కనీస వేతనం ఇవ్వడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం చలో హైదరాబాద్‌కు సిద్ధం కాగా, నాయకులను పోలీసులను అరెస్ట్ చేయడం గర్హనీయమని అమానుషమని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అన్నారు. నిరసనను భగ్నం చేసేందుకు ప్రభుత్వమే అరెస్ట్ చేయించిందని పేర్కొన్నారు.

పెద్దచెరువు కట్టకు పొంచి ఉన్న ముప్పు


చెరువు పెద్దతూము వద్ద కట్టకు పడిన బుంగ

కల్లూరురూరల్: కల్లూరు పెద్దచెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉందని రైతులు చెబుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో చెరువుకట్ట కోతకు గురికాగా, గరిష్ట స్థాయిలో నీరు ఉండడంతో ఎప్పుడేం జరుగుతోందనని ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు కింద సుమారు 1,500 ఎకరాల ఆయకట్టు ఉండడమే కాక కల్లూరు మండలంలోని వివిధ గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది. చెరువు పెద్దతూము వద్ద కట్టకు బొంగ పడగా, చిన్న తూము పక్కన కోతకు గురైంది. జల వనరుల శాఖ అధికారులు తక్షణమే మరమ్మతు చేయించాలని రైతులు కోరుతున్నారు.

'సేన' జిల్లా అధ్యక్షుడిగా హబీబ్

కల్లూరు: రాహుల్, ప్రియాంకాగాంధీ సేన జిల్లా అధ్యక్షుడిగా కల్లూరుకు చెందిన అబ్దుల్ హబీబ్ నియమితులయ్యారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఫయాజ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హబీబ్‌ను స్థానిక నాయకులు పలువురు అభినందించారు.

మున్సిపల్ పరిధిలో సమస్యలు పరిష్కరించాలి

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ వార్డుల్లో తాము చేసిన సర్వేలో అనేక సమస్యలు వెలుగు చేశాయని చెప్పారు. డ్రెయినేజీలు, సీసీరోడ్లు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నందున గతంలో ప్రకటించిన రూ.100 కోట్ల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, కుటుంబరావు, రజిత, మోహనరావు, సాంబశివరావు ఉన్నారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి


వైద్యులకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొమ్మినేని కృష్ణారావు కోరారు. ఈ సందర్భంగా సోమవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీలో డాక్టర్ ప్రశాంత్‌ను కలిసి మాట్లాడారు. ప్రజలు జర్వాల బారిన పడుతున్నందున వైద్యశిబిరాల ద్వారా పరీక్షలు నిర్వహించాలన్నారు. నాయకులు కత్తి రవి, లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, కాలసాని రాంబాబు, పాటి వెంకట్రావు, వెంకటకృష్ణ, రాంబాబు, గోపిరాజ్, మండదపు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలి

వైరారూరల్: రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని తక్షణమే సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లెనపాడులో సోమవారం ఖాళీ యూరియా సంచులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నందున ప్రభుత్వం స్పందించాలన్నారు. కిలారు శ్రీనివాసరావు, అమరనేని వెంకటేశ్వరరావు, ఆళ్ల శ్రీనివాస్, ఆళ్ల వెంకట్రావు, రాజేంద్ర ప్రసాద్, శ్రీరామినేని ప్రసాద్, వెంపటి సత్యం, రాజాబాబు, ఆళ్ల జ్యోతి, చంద్ర ఉమా, రేణుక, రంగయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైభవంగా దేవీ నవరాత్రులు ప్రారంభం

దేవీ శరన్నవరాత్రులు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలను మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా మండపాలకు చేర్చి ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో పలువురు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి మాలధారణ చేశారు. ఈ మేరకు నవరాత్రులు పూజలందుకునే అమ్మవారికి వివిధ అలంకరణలు చేసి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు కమిటీల ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిర : సుందరయ్యనగర్‌లో పూజలు..


ఎర్రుపాలెం : జమలాపురంలో అమ్మవారి వద్ద..


చింతకాని : మత్కేపల్లిలో దుర్గాదేవికి పూజలు


సత్తుపల్లి టౌన్ : దీక్ష స్వీకరిస్తున్న భక్తులు


పెనుబల్లి : వీ.ఎం.బంజరులో పూజలు


కల్లూరు : వీరబ్రహ్మేంద్రనగర్‌లో అమ్మవారు..


కొణిజర్ల : పూజలు చేస్తున్న మాలధారులు


ఏన్కూరు : పూజల్లో పాల్గొన్న భక్తులు


కారేపల్లి : శివాలయ ప్రాంగణంలో పూజలు..